# విశ్వ వైతాళికుడు

స్థంభించింది అకస్మాత్తుగా
జగత్తంతా ఒక్క క్షణం
జారింది లోకం చెక్కిళ్ళపై
గోరువెచ్చని అశ్రుకణం

నిలబడింది నిమేషకాలం
నిర్నిమేషంగా ఓల్గానది
కరిగి నీరై గట్లు తెంచుకుని
పొరలిపోయింది జనతాహృది

తలవంచింది దీనంగా
మౌనంగా అరుణపతాకం
సమర్పించింది శ్రద్ధాంజలి
సమస్త ప్రజానీకం
కలాన్ని చుట్టుకొని
ముందుకు
కదలలేకున్నది కవిత

జాలిగా నిట్టూర్చింది
శాంతి వొడిలో మానవత
పదేపదే కదలనే
కదలదా పెదవుల జంట
పదేపదే మ్రోగనే
మ్రోగదా గుడిలో గంట
కదలక కదలక కదిలిందో
ప్రపంచమంతా నిశ్శబ్దం
మ్రోగక మ్రోగక మ్రోగిందో
ముందుకు సాగుతుంది
శతాబ్దం

ఆయన వెలిగించిన
ఆశాజ్యోతి
అడ్డగిస్తుంది అశాంతిని
ఆయన ఆలపించిన
క్రాంతిగీతి
ప్రసరిస్తుంది ప్రశాంతిని

రైతుకు పట్టంకట్టిన
రష్యా భాగ్యవిధాత అతడు
కూలీకి కిరీటం పెట్టిన
స్టాలిన్ మహానేత యతడు

– జంధ్యాల పాపయ్యశాస్త్రి